

టార్పాలిన్ పరదాల కింద వృద్ధురాలు శ్రీరాం గట్టమ్మ

# అవ్వను ఆదుకుందాం..!

- అందరు ఉన్నా అనాథలా వృద్ధురాలు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న శ్రీరాం గట్టమ్మ
- దాతల సాయం కోసం ఎదురు చూపు

పెద్దపల్లి రూరల్, జూన్ 23: ఎనిమిది పదుల వయస్సులో మనుమలు, ముని మనుమలతో సంబురంగా గడపాల్సిన ఆ అవ్వ అనాథలా మారింది. అందరు ఉన్నా ఆదుకునేవారు లేక బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన శ్రీరాం పోచాలు–గట్టమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లు కాగా, ఎవరికి వారు స్థిర పడి బతుకుతున్నారు. పోచాలు పదేళ్ల కిందటే అనారోగ్యంతో మృతి చెందడంతో గట్టమ్మకు కష్టాలు మొదలయ్యాయి. గీత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కొడుకులు రాజేశం, లింగయ్య గ్రామంలోనే ఉండగా, పేదరికం వారికి శాపంగా మారి కుటుంబ పరిస్థితులను మరింత కుంగదీసింది. ఈ క్రమంలో అనారోగ్యం బారినపడి పెద్దకొడుకు రాజేశం మరణించగా, మరో కొడుకు లింగయ్య తాడిచెట్ట పైనుంచి పడి మృత్యువాత పడ్డారు. దీంతో గట్టమ్మ మరింత కుంగిపోయింది. ఒకవైపు కొడుకులు మరణించడం.. నా అనే వారు లేకపోవడంతో ఆమె దీన స్థితిని చూసిన గ్రామస్తులు కొందరు స్థానిక ప్రభుత్వ పాఠశాల పక్కనే టార్పాలిన్‌లు, పరదాలతో పందిరి వేసి తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. దీంతో గట్టమ్మ అందులోనూ ఉంటూ అటువైపు వచ్చినవారి సాయంతో చాయ్, టిఫిన్‌లతో కాలం వెల్లదీస్తున్నది. ఇప్పటి వరకు వర్షాలు లేకపోవడంతో కాలం వెల్లదీసిన ఆ వృద్ధురాలు, వర్షాలు కురిస్తే తన పరిస్థితి ఏంటని బిక్కుబిక్కుమంటోంది. దాతలు స్పందించి తనను ఆదుకోవాలని వేడుకుంటున్నది.

## పాఠశాలల తనిఖీ

ధర్మారం, జూన్ 23: మండలంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలను డీఈవో మాధవి సోమవారం తనిఖీ చేశారు. నల్లలింగయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఆలపించిన అభినయ గీతాలు, వర్ణమాల తోరణాలను చూసి ఉపాధ్యాయులను ఆమె ప్రశంసించారు. ఆమె వెంట ఎంఈవో ప్రభాకర్, సీఆర్పీలు కే కవిత, బీ కుమారస్వామి పాల్గొన్నారు.

# మంత్రిగా మంథనికి చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

- ఇసుక, మట్టి దోపిడీపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపై లేదు
- జేబీఎస్ పాఠశాలను ఎందుకు పూర్తి చేయడం లేదు..?
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, జూన్ 23: ఇక్కడి ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి దక్కించుకున్న శ్రీధర్‌బాబు అధికారాన్ని అడ్డం పెట్టుకొని డబ్బు సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని.. ఇసుక, మట్టి దోపిడీపై ఉన్న శ్రద్ధ మంథని నియోజకవర్గ అభివృద్ధిపై లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంథనిలో అసంపూర్తిగా ఉన్న జేబీఎస్ బాలుర పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా మంథని జేబీఎస్ పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయించినట్లు చెప్పారు. ఆ వెంటనే పనులు ప్రారంభించామని చెప్పారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని వెల్లడించారు. భవనానికి రంగులు వేయడం, బాత్‌రూం, ప్రహరీ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరవుతున్నా మిగిలి పోయిన పనులను కూడా చేయించడం లేదని విమర్శించారు. బహిరంగ సభలు, వేదికల్లో మంథని నియోజకవర్గానికి జేఎన్‌టీయూ, ఐటీఐ కళాశాలలు తీసుకువచ్చానని మంత్రి చెప్పుకుంటున్నారని, ఆ కాలేజీలో మంథని నియోజకవర్గ ప్రజలకు ఏమైన ప్రత్యేక కోటా ఉందా అని ప్రశ్నించారు. స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తే ఈ ప్రాంత విద్యార్థులు, ఓటర్లకు మేలు చేసినట్లవుతుందనే విషయాన్ని గమనించక పోవడం బాధాకరమన్నారు. ఇదేనా విజ్ఞాన కేంద్రంగా మంథని నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడమంటే అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, నియోజకవర్గంలో ఆయన పాలనను ప్రశ్నించే వారిని వీధికుక్కలు అంటూ మాట్లాడడం మంత్రి అవివేకానికే నిదర్శనమన్నారు. ఉన్నత విద్యావంతుడిని అని చెప్పుకునే మంత్రి ప్రతి పక్ష నాయకుడి ఇంట్లో గంజాయి పెట్టించి, ఆ కుటుంబాన్ని నాశనం చేయాలనుకునే చర్యకు పాల్పడటాన్ని ఏమంటారని ప్రశ్నించారు. తన సామాజిక వర్గానికి చెందిన వారితో ఇసుక, మట్టి దోపిడీ చేయిస్తూ కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని, ఈ డబ్బులతో రాబోయే ఎన్నికల్లో మళ్లీ చక్రం తిప్పాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుల ఎత్తుగడలను ప్రజలు గమనిస్తున్నారని, ఓటుకు రూ. 5వేల ఖర్చు చేసినా ప్రజల తగిన గుణపాఠం చెప్తారని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, ఆరెపల్లి కుమార్, గొబ్బూరి వంశీ, కాయితీ సమ్మయ్య, జంజర్ల శేఖర్, వెల్పుల గట్టయ్య, మంథని లక్ష్మణ ఆసీఫ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 23: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నార్కొటిక్ బ్యూరో ఆర్ఎన్‌సీసీ కరీంనగర్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై ఏసీపీ ఉపేందర్ రెడ్డి అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడడంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. ఇక్కడ సీఐ కృష్ణమూర్తి, ఎస్ఐ భూమేశ్, ఉపాధ్యాయులు జగదీశ్వర్, సమీర్, లక్ష్మీదేవి, రమాదేవి, భాగ్యలక్ష్మీ, సుభద్ర ఉన్నారు.

## బొగ్గుగనుల సంక్షేమంపై బీఎంఎస్ పోరాటం

గోదావరిఖని, జూన్ 23: దేశవ్యాప్తంగా బొగ్గు గనుల కార్మికుల సంక్షేమం కోసం బీఎంఎస్ నిరంతరం నిస్వార్థంగా పోరాటం చేస్తుందని బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కొత్తగూడెంలో జరిగిన సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 80శాతం బొగ్గు ఉత్పత్తి కాంట్రాక్టీకరణ, కాంట్రాక్ట్ కార్మికులతో జరుగుతుందన్నారు. వారి హక్కులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో బీఎంఎస్ జూలై 24 నుంచి సెప్టెంబర్ 15వరకు నాలుగు విడతలుగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లండించారు.



సమావేశానికి హాజరైన అధికారులు, గ్రామస్తులు

# రెండో రోజు విద్యాశాఖ అధికారుల పర్యటన

- మంచర్యామిలో తల్లిదండ్రులు, మహిళా సంఘాలతో సమావేశం

సుల్తానాబాద్‌రూరల్,జూన్ 23: మూత పడిన సర్కారు బడిని తెరిపించేందుకు గాను రెండో రోజు మంచరామి గ్రామాన్ని మండల విద్యాశాఖ అధికారులు సందర్శించారు. సర్కారు బడిని తెరిపించండి అంటు ఇటీవల నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఆదివారం మండలంలోని మంచరామి మూతబడిన సర్కారుబడి ఆవరణలో సోమవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఏలు, మహిళ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గ్రామంలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, తదితరులు హాజరైయ్యారు. దాదాపుగా 40 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏంఈవో ఆరెపల్లి రాజయ్య మాట్లాడుతూ. తప్పనిసరిగా పిల్లలను సర్కారు బడికి పంపించాలని కోరారు. సర్కారు బడికి పిల్లలను పంపిస్తే రేపే పాఠశాలను ప్రారంభిస్తామని, 15 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు, 15 మంది కంటే తక్కువ ఉంటే ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తామని వెల్లడించారు. జిల్లా అధికారుల అదేశాల మేరకు అమ్మ ఆదర్శ కమిటీని ఎన్నుకొని వాళ్లతో పాఠశాలను మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. దాదాపుగా 20 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. మరో 15 మంది విద్యార్థులు కూడా త్వరలో రావడం జరుగుతందని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. మంగళవారం నుంచి పాఠశాలను ప్రారంభించడం జరుగుతుందని ఏంఈవో అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందితో పాఠశాల తెరిపించి, శుభ్రం చేయించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్, సీఆర్‌పిలు కిరణ్, మంజుల, ప్రియాంక ఉన్నారు.

## బీమా చెక్కులు అందజేత

మంథని రూరల్, జూన్ 23: మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన చొప్పరి ఓదెలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి మంజూరైన రూ. 10లక్షల 50వేల ఇన్సూరెన్స్ చెక్కును పెద్దపల్లి బ్రాంచ్ మేనేజర్ మురళీ, యూనిట్ మేనేజర్ రమేష్‌లు చెక్కును సోమవారం పంపిణీ చేశారు. ఓదెలు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ. 50 స్మార్ట్ స్కాలర్, రూ. 50వేలతో ప్లాటినం ప్లస్ పాలసీలను తీసుకోగా వీటికి సంబంధించి రూ.10లక్షల 50వేల బీమా మంజూరు కాగా వాటిని పంపిణీ చేసినట్లు మేనేజర్ మురళీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లైఫ్ మిత్రలు వేణు, నాగరాజు, రమేష్, వెంకటేష్, రాంచందంర్ ఉన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ పల్లపు నర్సయ్య, S/o. వెంకటి, వయస్సు: 38 సం||లు, వృత్తి: బిజినెస్, కన్నాల గ్రామము, మండలం పాలకుర్తి, జిల్లా పెద్దపల్లి, గ్రామము కన్నాల, గ్రామపంచాయతీ కన్నాల, మండలం పాలకుర్తి, జిల్లా: పెద్దపల్లి రిజిస్ట్రేషన్ జిల్లా, పెద్దపల్లి రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా పెద్దపల్లి, కన్నాల గ్రామము కోడ్ నెంబరు 2008011 యందలి సర్వే నెం: 550 విస్తీర్ణము 605.66 చదరపు గజములు సరియగు 506.39 చదరపు మీటర్లు గల ఖాళీస్థలమునకు హద్దులు: లో కల ఈ హద్దులు.

ఉత్తరం: అమ్మిన వారి ఖాళీస్థలము
దక్షిణం: దాసరి బాపు గారి ఖాళీస్థలము
తూర్పు: 18 ఫీట్ల వెడల్పు గల దారి
పడమర: ఇతరుల ఖాళీస్థలము

కల దానిని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాదీనములో ఉండి నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ పెద్దపల్లి వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

నమస్తే తెలంగాణ CLASSIFIED

**PASSPORT LOST**

★ Chippa Naresh S/o.Chippa Rajesham H.No. 1-34, R/o. Sriramulapally, Koheda Mandal Karimnagar Dist. My Pass Port No. K1413328 Lost By Travelling at Sircilla old Busstand. If any one found Please Call : 9963710853
NTK-330349

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

# సర్కారు బడిలో చేరాలని కరపత్రాలతో ప్రచారం




పాఠశాలలో చేరిన విద్యార్థులతో హెచ్ఎం వంశీ మోహనాచార్యులు

ధర్మారం, జూన్ 23: గవర్నమెంట్ బడి కంటే ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులు బాగా చదివితే ఒక్కొక్కరికి బహుతమనం ఇస్తామని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం గ్రామంలో ఓపెన్ ఛాలెంజ్ చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ బడిలోని చేర్పించి ఆదర్శంగా నిలిచారు. రచ్చపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వంశీ మోహనాచార్యులు ఆ పాఠశాలలో విద్యార్థులు చేరడానికి వినూత్నంగా ప్రయోగం చేశాడు. ఒకటి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులంతా ఆ పాఠశాలలో చేరారు. గత ఏడాది ఈ బడిలో సంవత్సరం 36 మంది సంఖ్య ఉండగా వారిలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు వెళ్లారు.దీంతో సంఖ్య 30 వరకు మాత్రమే ఉంది.

ఓపెన్ ఛాలెంజ్ తో ఆ పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు కొత్తగా 20 మంది విద్యార్థులు దీంతో పాఠశాలలో 50 కి చేరుకుంది. దీంతో ఈ పాఠశాలలో ఊరి పిల్లలు ఒక్కరు కూడా ప్రైవేట్ కి వెళ్లడం లేదు అని హెచ్ఎం పాఠశాలలో ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.సర్కార్ బడిపై నమ్మకంతో విద్యార్థులను చేర్పించిన తల్లిదండ్రులకు హెచ్ఎం వంశీ మోహనాచార్యులు సహ ఉపాధ్యాయులు సంపత్, వంశీ.వీవీ లక్ష్మణ్ లు కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, జూన్ 23 : అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు అన్నారు. పెద్దకల్వల, పెద్దబొంకూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి నులకు శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందించి ముగ్గులు పోసి పనులను ప్రారంభించారు. కొందరు మహిళలు నాటి నుంచి నేటి వరకు వచ్చిన వాళ్లకే ప్రభుత్వ పథకాలు వస్తున్నాయని చెప్పడంతో అసహనానికి లోనైన ఎమ్మెల్యే ఓపికతో ఉంటే అందరికీ వస్తాయని తొందరేం లేదని ఇంకా మూడేళ్ల వరకు పథకాలు నడుస్తూనే ఉంటాయన్నారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప సురేందర్, తహసీల్దార్ దండిగ రాజయ్య యాదవ్, ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, ఎంపీవో జనగామ శరత్ బాబు, నాయకులు సందనవేని రాజేందర్ యాదవ్, కలబోయిన మహేందర్, నూగిల్ల మల్లయ్య, కార్యదర్శులు దేవరనేని నిశాంత్ రావు, పుట్ట శ్రీనివాస్ యాదవ్, అర్కుటి సంతోష్ యాదవ్, సలేంద్ర రాజయ్యయాదవ్, కారెంగుల రమేష్, మధునయ్య, మొగులసాల సరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం**

ఎలిగేడు,జూన్ 23 ః డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రారంభించారు. ఎలిగేడు మండల కేంద్రనుండి సుల్తాన్‌పూర్ వరకు గల డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన ఎలిగేడు లోని ఎలిగేడు సుల్తాన్‌పూర్ క్రాసింగ్ వద్ద శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న,ఆర్ అండ్ బీ ఏఈలు కాంగ్రెస్ పార్టీ నాయ కులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఐడియల్ పాఠశాలపై కేసు నమోదు చేయాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 23: ప్రభుత్వ అనుమతి లేకుండా అడ్మిషన్‌లు స్వీకరిస్తున్న ఐడియల్ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని సురభికాలనీలో కొత్త భవనంలో ఐడియల్ పేరుతో ఏర్పాటు చేసిన పాఠశాలకు ప్రభుత్వ అనుమతి లేదన్నారు. విద్యాశాఖలో కొంతమంది అవినీతికి పాల్పడటంతోనే ఆయా పాఠశాల యాజమాన్యం అడ్మిషన్‌లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైన అధికారులు పాఠశాల భవన యాజమానిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఎంఈఓ సురేంద్రకుమార్ వివరణ కోరగా స్పందించారు. ఐడియల్ పాఠశాల పాత భవనంలో కొనసాగేందుకు మరో నాలుగేళ్ల వరకు గడువు ఉందన్నారు. కాని కొత్త భవనంలో పాఠశాల నడిపేందుకు అనుమతి లేదని ఎంఈఓ తెలిపారు. షిఫ్టింగ్‌కు ధరఖాస్తు చేసుకున్నప్పటికి సరైన సదుపాయలు లేకపోవడంతో ధరఖాస్తు పెండింగ్‌లో ఉంచామన్నారు. కొత్త భవన్‌లో అడ్మిషన్‌లు తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

# భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

సుల్తానాబాద్ రూరల్,జూన్ 23: రైతులు పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు నిర్వహించుకున్నట్లయితే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఈవో రవితేజ పేర్కొన్నారు. మండలంలోని మియ్యాపూర్ గ్రామంలోని వ్యవసాయ భూమల్లోని మట్టిని సోమవారం భూసార పరీక్షల కోసం నమూనాలను వ్యవసాయ అధికారులు సేకరించారు. జాతీయ సహజ వ్యవసాయం మిషన్‌లో భాగంగా ఎంపికైన మియ్యాపూర్ గ్రామంలో 125 మంది రైతుల పంట పొలాల్లో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించి మట్టిని ఫలితాల కోసం భూసార పరీక్ష కేంద్రానికి పంపనున్నట్లు ఏఈవో రవితేజ తెలిపారు. కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

పెద్దపల్లి, జూన్ 23: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో వన మహోత్సవం, ప్రొటోకాల్‌పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో 30 లక్షల పైగా మొక్కలు నాటడం లక్ష్యమని వెల్లడించారు.గుంతల తవ్వకం పనులు ఉపాధి హామీ పథకం కింద చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం 2500 ఎకరాలు..**

ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాలను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం, ఎరువుల లభ్యతపై సమీకృత కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. వర్షా కాలంలో రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ప్రతి రైతు వేదికలో మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమానికి కనీసం 300 మంది రైతులు పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో డీఏవో దోమ ఆదిరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్ మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరడా.



అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న జేసీబీ

- 'నమస్తే' కథనానికి స్పందన
- రంగంలోకి దిగి...నేలమట్టం చేసి

కోల్‌సిటీ, జూన్ 23: రామగుండం నగర పాలక సంస్థ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో పోచమ్మ మైదానంలో రాత్రికి రాత్రే వెలిసిన అక్రమ నిర్మాణాలపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు..' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఆ నిర్మాణాలకు కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేవని నగర పాలక కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ వివరణ కూడా ఇచ్చారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌లో మొబైల్ దుకాణాలను నేలమట్టం చేయడంతో అక్కడి వ్యాపారులు వీధిన పడ్డారు. వారికి ప్రత్యామ్నాయం చూపించలేదు. కానీ, నగరం నడిబొడ్డున ప్రధాన చౌరస్తాలో మాత్రం నిర్మాణాలు కొనసాగుతుండగా, వ్యాపారాలు కోల్పోయిన బాధితుల ఆవేదనను ఉటంకిస్తూ 'అక్రమ నిర్మాణాలను అడ్డుకునేదెవరు..' శీర్షికన ఈనెల 11న మరో కథనం ప్రచురితమైంది. ఈ వరుస కథనాలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ స్పందించారు. గోదావరిఖని చౌరస్తాలో అనుమతులు లేకుండా వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. దీనితో నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సోమవారం సాయంత్రం చౌరస్తాకు చేరుకొని ఎక్స్‌కవేటర్‌తో అక్కడి నిర్మాణాలను నేలమట్టం చేశారు. నగర పాలక సంస్థ అధికారులు స్పందించిన తీరును స్థానికులు హర్షం వ్యక్తం చేశారు కాగా కూల్చివేతల అనంతరం బాధితులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబితేనే తాము ఇక్కడ తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నామని, నెల రోజులుగా నిర్మాణాలు కొనసాగుతున్న కార్పొరేషన్ అధికారులు ఎందుకు అడ్డు చెప్పలేదని, నిర్మాణాలు పూర్తయ్యాక ఇప్పుడు వచ్చి అనుమతులు లేవని కారణం చెబుతూ దాదాపు 12 షాపులు నేలమట్టం చేశారని, దీంతో ఒక్కొక్కరం దాదాపు లక్ష వరకు నష్టపోయామని, ఇదంతా ప్రభుత్వ తప్పిదమే అని ఆవేదన వ్యక్తం చేశారు



## తరగతి గదిలో ప్రధానోపాధ్యాయుడి నిద్ర!

ఎలిగేడు,జూన్ 23 : ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గతూ వస్తున్నది. సర్కాకు స్కూళ్లను బలోపేతం చేయాల్సిన ఉపాధ్యాయులు బోధనను అటకెక్కిస్తునారు. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులి వెంకటేశ్వర్‌రెడ్డి తన విధుల్లో భాగంగా సోమవారం పాఠశాలకు వచ్చి తరగతి గదిలో నిద్రించడం పలువుర్ని ఆశ్చర్యపర్చింది. పేదవిద్యార్థులకు చదువుచెప్పి కార్పొరేట్ పాఠశాలలను మైమరపించాలని, ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందిస్తుంటే, ఈ సదరు ప్రధానో పాధ్యాయుడు ఏకంగా నిద్రపోతుండడంతో తల్లిదం డ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కొందరు ఎంఈవోను సంప్రదించగా చర్యలు తీసుకుం టామన్నట్లు తెలిపారు.

## అక్రమ ఇసుక,మట్టి రవాణా చేస్తే చర్యలు

ఎలిగేడు,జూన్ 23 : ఇసుక,మట్టి అక్రమంగా రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో జేసీబీ, ట్రాక్టర్ యజమానులతో సమావేశమయ్యారు. ఇసుక, మొరం మట్టి లాంటివి అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో రవాణా చేయకూడదని,అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేయడమేకాకుండా శిక్షతోపాటు జరిమానాలు భారీగా వేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీబీ, ట్రాక్టర్ యజమానులతోపాటు తహసీల్దార్ యాకన్న, ఏఎస్ఐ రాంచంద్రం,జయలక్ష్మీ, తాజామాజీ సర్పంచ్ వెంకన్న, గిర్దావర్ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా బోధన

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 23: కొత్తగూడెంలోని మహిళా కళాశాలలో ప్రైవేట్‌కు దీటుగా బోధిస్తున్నట్లు హెచ్‌వోడీ డాక్టర్ దేవికా అన్నారు. సింగరేణి సెక్టార్–3 పాఠశాలను మంగళవారం సందర్శించి మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యాబోధన జరుగుతుందని గుర్తు చేశారు. దోస్త్ యాప్ ద్వారా సింగరేణి కళాశాలను ఎన్నుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఇంగ్లీష్ లెక్చరర్ కె. ఆశాజ్యోతి, పి. నాగమ్మ ఉన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం

పెద్దపల్లి, జూన్23: ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టర్ ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**పట్టాలు ఇప్పించండి..**

ప్రభుత్వ భూమిలోని చెట్ల పొదలను తొలగించి 37 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని మోకాపై సర్వే చేయించి అర్హులకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ మంథని మండలం బిట్టుపల్లి గ్రామస్తులు కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం అందజేశారు. పట్టాలు ఇప్పించాలని గతంలోనే దరఖాస్తు చేసుకుంటే అప్పటి ఆర్ఐ, తహసీల్దార్, సర్వేయర్ సంయుక్తంగా సర్వే చేశారని తెలిపారు.అర్హులైన వారందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మంథని సదయ్య, పోగుల సదానందం, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం యువతి వివాహానికి 'వ్యాళ్ల' చేయూత

కోల్‌సిటీ, జూన్ 23: నిరుపేద ముస్లిం యువతి వివాహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి చేయూత అందించారు. 8వ డివిజన్ గంగానగర్‌కు చెందిన సయ్యద్ ఖాసీం అనే లారీ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యాడు. అతని కూతురు షిఫానా అంజుమ్‌కు వివాహం నిశ్చయమైంది. పెళ్లి ఖర్చులకు ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబ పరిస్థితి తెలుసుకొని వ్యాళ్ల హరీష్ రెడ్డి తక్షణ సాయం అందించాలని టీం సభ్యులకు సూచించారు. మాజీ కో–ఆప్షన్ తస్నీం భాను, మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి తుల మీదుగా యువతి కుటుంబంకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. నియోజక వర్గంలోని నిరుపేద కుటుంబాలకు ఆపదలో సమయంలో కొండంత అండగా నిలుస్తున్న హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి జాహిద్ పాషా, మునుకుంట్ల కృష్ణస్వామి, పొలాడి శ్రీనివాస రావు, డా.కరుణాకర్, బొట్ల పోచం, నడిపెల్లి సాయి, గోపి, సయ్యద్ అక్బర్, నూతి రాజ్‌కుమార్, సజ్జు, ఆరిఫ్, యాకూబ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రామగిరి, జూన్ 23: సింగరేణి సంస్థ సామాజిక బాధ్యత నిధులతో ఆర్జీ–3 ఏరియాలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలని ఏపీఏ ఇన్‌చార్జి జీఎం బండి సత్యానారాయణ, ఆర్జీ–3 ఎస్ఓటు జీఎం రామ్మోహన్ అన్నారు. స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో 30 మంది అభ్యర్థులకు రెండు వారాల పాటు నిర్వహించనున్న ఉచిత సోలార్ టెక్నిషియన్ శిక్షణా తరగతులను వారు ప్రారంభించారు. సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం కూడా ఎన్నో నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ సుజిత్, డీఎస్ఈ శ్రీనివాస్, శిక్షకులు తేజావత్ అశోక్ పాల్గొన్నారు.

## సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టం

రామగిరి, జూన్ 23: సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టమని ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు అన్నారు. ఈమేరకు ఆర్జీ–3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో పని చేస్తూ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించిన ఐదుగురు డిపెండెంట్లకు సోమవారం కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. సీనియర్ ఉద్యోగుల దగ్గర నేర్చుకొని కలిసికట్టుగా పని చేస్తూ భవిష్యత్‌లో పదోన్నతులు పొందాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు వై.వి రావు, రామచంద్రారెడ్డి, కోట రవీందర్, సాయికృష్ణ, పర్సనల్ విభాగం అధికారి సుదర్శనం, డీవైపీఎం సునీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.